క్లుప్తంగా

బ్రహ్మ సహిత నాగలింగేశ్వరుడికి పూజలు



బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో వెలసిన బ్రహ్మ సహిత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో చైత్ర మాసం సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చిన్ని శేషఫణి, అర్చకుడు నాగ శేషఫణి శర్మ ఆధ్వర్యంలో ఉమా నాగలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు.

11న సర్వసభ్య సమావేశం

అవుకు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో ఏప్రిల్ 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అజాంఖాన్ సోమవారం తెలిపారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు పాల్గొని, ఆయా శాఖల్లో జరిగిన ప్రగతి గురించి, జరగాల్సిన అభివృద్ధి గురించి వివరించనున్నట్లు ఎంపీడీఓ చెప్పారు.

ముగిసిన చౌడేశ్వరీదేవి రథోత్సవం



చౌడేశ్వరిదేవి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి జ్యోతి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం(రావడం) సోమవారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా జరిగింది. గ్రామ ముఖ ద్వారం వద్ద ఉన్న అమ్మవారి రథాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం వద్దకు చేర్చారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

30న సీతారాముల కల్యాణం

కోవెలకుంట్ల: శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని మండలంలోని రామాలయాల్లో ఈ నెల 30న సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించనున్నారు. గుళ్లదూర్తి గ్రామంలోని సీతారామాశ్రమంలో భద్రాచలం తరహాలో సీతారాముల కల్యాణం జరపనున్నారు. అలాగే వెలగటూరు, భీమునిపాడు, కలుగొట్ల, రేవనూరు, కంపమల్ల, తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు జరగనున్నాయి

భూమి పూజ



భూమి పూజలు చేస్తున్న పండితులు

డోన్ టౌన్: మండల పరిధిలోని ఆవులదొడ్డి గ్రామ సమీపంలో వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి సన్నిధిలో కల్యాణ మండపం నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ న్యాయవాది ఆలా మోహన్‌రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పండితులు పూజలు నిర్వహించి మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఓఎస్డీ ఏర్పాటు



ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్‌ను కలిసిన ఓఎస్డీ

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న పాలిటెక్నిక్ కళాశాలకు ఓఎస్డీగా ఎంపీ రాజేష్‌ను ప్రభుత్వం నియమించింది. సోమవారం ఎంపీ రాజేష్.. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభమయ్యే పాలిటెక్నికల్ కళాశాల తరగతుల నిర్వహణకు సంబంధించి తాత్కాలిక భవనాల ఏర్పాటుపై చర్చించారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సూరప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

డోన్ టౌన్: గ్రామీణ నిరుద్యోగ యువతకు రిటైల్ సేల్స్ సూపర్ వైజర్, పేషెంట్ రిలేషన్ అసోసియేట్(అపోలో హాస్పిటల్స్‌లో) కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డీఆర్‌డీఏ జాబ్స్ కో ఆర్డినేటర్ శేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భోజన వసతి, యూనిఫాం అందించి అనుభవజ్ఞులతో 90 రోజులు పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 19 నుంచి 26 ఏళ్ల మధ్య వయస్సున్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 7288813984-6304716600 సంప్రదించాలన్నారు.

● **తొలగిన శాశ్విత కష్టాలు**



కోవెలకుంట్ల మేజర్ పంచాయతీలోని నాల్గవ గ్రామ సచివాలయ పరిధిలో సుంకులమ్మ గుడి సమీపంలో ఉన్న కాలనీ వెళ్లే అంతర్గత రహదారి అధ్వానంగా ఉండేది. డ్రెయినేజీ లేక చిన్నపాటి వర్షం వచ్చినా వర్షపునీరు రోడ్డుపైకి చేరి రాకపోకలకు కాలనీ వాసులు అవస్థలు పడేవారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీ వాసులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. సీసీ రోడ్డు, డ్రెయినేజీ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయానికి కేటాయించిన నిధులు సరిపోకపోవడంతో మేజర్ పంచాయతీ నుంచి మరో రూ.5 లక్షలు వెచ్చించి 210 మీటర్ల మేర సీసీ రోడ్డు, 300 మీటర్ల మేర డ్రెయినేజీ ఏర్పాటు చేశారు. ఏళ్లకాలం నుంచి ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● **500 మీటర్లతో డ్రెయినేజీ పనులు**



మేజర్ పంచాయతీలోని మూడవ గ్రామ సచివాలయ పరిధిలో సాయినగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ లేక కాలనీవాసుల ఇబ్బందులు వర్ణనాతీతం. వర్షాకాలంలో నీరంతా ఇళ్లచుట్టూ, ఖాళీ ప్రదేశాల్లో చేరి దుర్వాసన వెదజల్లేది. దోమలు వృద్ధి చెంది పారిశుద్ధ్య లోపంతో రోగాలు ప్రబలేవి. సమస్యను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గుర్తించారు. సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల నిధులతో డ్రెయినేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడంతో వారు పంచాయతీ నిధులు కూడా కొంత వెచ్చించి సమస్యను పరిష్కరించారు.

గడప గడపలో అభివృద్ధి పరుగులు

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. వాటితో సీసీ రోడ్లు డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ తదితర అభివృద్ధి పనులు చేస్తూ ప్రజల మన్ననలు చూరగొంటోంది

– కోవెలకుంట్ల

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో గుర్తించిన సమస్యలకు పరిష్కారం
- ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు కేటాయింపు
- సీసీరోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారంపై దృష్టి



చిన్నకొప్పెర్లలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతి గ్రామ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ నిధులను వెచ్చించేందుకు ముందుగా గ్రామసభలు నిర్వహించి ఆయా పనులు గుర్తిస్తారు. ప్రాధాన్యతా క్రమంలో నిర్ణయం తీసుకుంటారు. పనుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసి సచివాలయాలకు సంబంధించిన కమిషనర్ ఆమోదం తీసుకుంటారు. అనంతరం జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి ద్వారా కలెక్టర్‌కు పంపిస్తారు. కలెక్టర్ అనుమతి పొందిన తర్వాత ఆయా శాఖలు అంచనాలు రూపొందించి మళ్లీ కలెక్టర్ ఆమోదం మేరకు పనులు చేపడుతున్నారు. అభివృద్ధి పనులు ప్రారంభించినప్పటి నుంచి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించే వరకు మొత్తం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. పనులు మొదలు పెట్టినప్పుడు ఫొటో తీసి అప్‌లోడ్ చేయడం ద్వారా గడప గడపకు మన ప్రభుత్వంలో పనుల ఎంపిక ప్రక్రియ పూర్తి అవుతుంది. పనులు పూర్తి అయిన తర్వాత ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారి ఎంపీడీఓ అనుమతితో బిల్లులు అప్‌లోడ్ చేస్తారు. అనంతరం సదరు కాంట్రాక్టర్‌కు ఖాతాల్లోకి సీఎఫ్ఎంఎస్ ద్వారా నిధులు జమ చేస్తున్నారు.

మారిపోతున్న రూపురేఖలు

ఎమ్మెల్యే పర్యటనకు గ్రామ సచివాలయ ఉద్యోగులతోపాటు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాల్సి ఉంది. ప్రజల నుంచి సమస్యలు వస్తే వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి వాటి పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. గడప గడపకు కార్యక్రమం ముగిసిన కొన్ని రోజుల్లో ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరిస్తుండటంతో గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయి.

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు



ప్రభుత్వం సంక్షేమంతోపాటు గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టి సారించింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం శుభ పరిణామం. ప్రధాన వీధుల్లో సైతం సీసీ రోడ్లు లేక అవస్థలు పడుతున్న తరుణంలో రోడ్లు, డ్రెయినేజీ వేయడం సంతోషకరం.

– గుర్రప్ప, కోవెలకుంట్ల

త్వరితగతిన సమస్యల పరిష్కారం



గతంలో చిన్నపాటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నా మండల కేంద్రాల్లో ఉండే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఏళ్లు గడిచినా అవి పరిష్కారమయ్యేవి కావు. గడప గడప కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు వస్తున్నారు. సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిష్కరిస్తున్నారు.

– దేవరాజు, కోవెలకుంట్ల

విజేత తాడేపల్లి వృషభాలు



యజమానికి బహుమతి అందజేస్తున్న పీఆర్ వెంకటేశ్వరరెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో చౌడేశ్వరీదేవి జ్యోతి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రాతి దూలం పోటీలో గుంటూరు జిల్లా తాడేపల్లి లంకిరెడ్డి, నిశిత్ రెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. రెండవ బహుమతిగా నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి ఎద్దులు, మూడవ బహుమతిగా అనంతపురం జిల్లా ఉరవకొండ మమ్మద్‌అలి, పామిడి రామకృష్ణ ఎద్దులు, నాల్గో బహుమతిగా ప్యాపిలి మండలం పీఆర్‌పల్లి శ్రీరాములు, మీఎస్ పల్లి చిట్టిబోయిన భరత్‌కుమార్‌యాదవ్, ఐదవ బహుమతి అనంతపురం జిల్లా గార్లదిన్నె కె.రామాంజనేయులు, ఆరవ బహుమతిగా గోస్పాడు మండలం జిల్లెల్ల గోటిక రవి తేజేశ్వరరెడ్డి, ఏడవ బహుమతి బాపట్ల పావులూరి వీరస్వామి చౌదరి, ఎనిమిదవ బహుమతిగా చాగలమర్రి మండలం మూడురాళ్లపల్లె పి.చిన్నఓబులరెడ్డి వృషభాలు దక్కించుకునట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు నాగార్జునరెడ్డి జ్ఞాపకార్థం వరుసగా రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతులను చౌడేశ్వరి దేవి ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరెడ్డి అందజేశారు.

భవన విస్తరణ పనులకు భూమి పూజ

కోవెలకుంట్ల: స్థానిక గాంధీసెంటర్‌లో ఏర్పాటు చేసిన కామ్రేడ్ జీవీ కొండారెడ్డి స్మారక గ్రంథాలయ భవన విస్తరణ పనులకు మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ చేశారు. దాతల సహకారంతో గ్రంథాలయ అభివృద్ధి, విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరీంబాషా, కార్డ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అప్పపోగు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్థిక మంత్రి పర్యటన

డోన్ టౌన్: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ నియోజకవర్గంలో మంగళవారం నుంచి వారం రోజుల పాటు పర్యటించనున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం బేతంచెర్ల పట్టణానికి చేరుకుని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. బుధవారం డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో పొదుపు గ్రూపు మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ చేస్తారన్నారు. గురువారం మంత్రి స్వగృహం ఎదుట రూ.30 లక్షలతో రూపుదిద్దుకున్న పార్కును ప్రారంభిస్తారని, అదే రోజు సాయంత్రం వెంకటాపురం తుమ్మల చెరువులో బోటింగ్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తారన్నారు. సమావేశంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బండలాగుడు, కబడ్డీ పోటీలు

ప్యాపిలి: శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 30న మండల పరిధిలోని సిద్దనగట్టు, నేరేడుచర్ల గ్రామాల్లో ఎడ్ల బండలాగుడు, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అంజేస్తామన్నారు.

ఉమామహేశ్వరుడికి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతులకు సోమవారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అర్చన నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి పల్లకీ సేవా మహోత్సవాన్ని నిర్వహించారు.

చికెన్ ధరలపై పాలక వర్గం చర్చ



చికెన్ షాపు యజమానులతో మాట్లాడుతున్న రాజేష్ తదితరులు

డోన్: కొనలేం.. తినలేం శీర్షికన చికెన్ ధరలపై ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ యంత్రాంగం స్పందించింది. షాపుల యజమానులతో సోమవారం మున్సిపల్ పాలక వర్గం సమావేశమై ఇష్టానుసారంగా చికెన్ ధరలు పెంచుతుండటంపై చర్చించింది. కాల్చిన చికెన్ కిలో రూ.200, కాల్చని చికెన్ కిలో రూ.180లకు మాత్రమే విక్రయించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కోళ్ల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా మున్సిపల్ ప్రత్యేక వాహనంలో వేయాలని సూచించారు. సమావేశంలో చికెన్ వ్యాపారులతో పాటు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పూజల్లో ఎమ్మెల్యే రామిరెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణ సమీపంలోని రవ్వలకొండపై వెలసిన వీరప్పస్వామి, గాయత్రీదేవి, దాక్షాయణి మూర్తిల విగ్రహాల ప్రతిష్టి మహోత్సవం సోమవారం ముగిసింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలజ్ఞాన తత్వవేత్త వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం రచించిన రవ్వలకొండ ఎంతో ప్రముఖ్యత సంతరించుకుందన్నారు. దాతల సహకారంతో ఇక్కడ రూ.కోటితో వీరప్పయ్యస్వామి ఆలయంతో పాటు గాయత్రీదేవి, దాక్షాయణిస్వామి విగ్రహాల ప్రతిష్ట చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, సమరసత సంఘం జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు ప్రభుత్వం అండ

● మున్సిపల్ చైర్మన్ రాజేష్



మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్

డోన్: పొదుపు మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక 2వ సచివాలయంలో సోమవారం ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబు వడ్డీ మాఫీ అంటూ పొదుపు మహిళలను మోసగించారన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలా కాదని, ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా రుణాలను మాఫీ చేస్తున్నారని చెప్పారు. మూడో విడత ఆసరా కింద రూ.4.55 కోట్లు మహిళల బ్యాంక్ ఖాతాలకు జమ అయ్యాయన్నారు. సమావేశంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ జాకీర్, మెప్మా కమ్యూనిటీ కో ఆర్డినేటర్ సుజాత, ఆర్గనైజర్ జయంతి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బి.సుజాత, కౌన్సిలర్లు మేకల విమల, పాలుట్ల మీనాక్షి, దారా హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఈశ్వరయ్యలు కోరారు. సోమవారం లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షులు బాలయ్య, నాయకులు సాధిక్ హుసేన్, శ్రీను, నూరుల్లా ఖాద్రి, బాషా, రాజబాబు, అంకాలు, నాగరాజు, వెంకి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాలపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మావతి

కొలిమిగుండ్ల: పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కోవెలకుంట్ల ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. సోమవారం బెలుంలో పోషణ్ పక్వాడ్‌పై సూపర్‌వైజర్ శ్రీవాణితో కలిసి మండల స్థాయి సమావేశం నిర్వహించి అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శనలో ఉంచి వాటి ప్రాధాన్యతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. చిన్నారులకు బాలామృతం తప్పక తినిపించాలన్నారు.

● **డోన్ రూరల్:** మండల పరిధిలోని కొత్తకోటలో సోమవారం సీడీపీఓ షంషాద్‌బేగం ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణులకు, బాలింతలకు సీడీపీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జయమ్మ, వీఆర్ఓ గోవిండ్, సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి ఆదాయం

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పంచాయతీకి వివిధ వేలాల ద్వారా ఆదాయం సమకూరింది. ఎంపీడీఓ శివరామయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వేలంపాటల్లో దిన, వారపు మార్కెట్ రూ.11,7600, వాహనాల స్టాండ్ రూ.10,1100, జంతువధశాల రూ.82 వేలకు పాటదారుడు షేక్ మహబూబ్‌సా దక్కించుకున్నారని పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఖలీల్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈసారి యల్లమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాబుసాహెబ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లెలోని ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు సోమవారంతో పూర్తయ్యాయి.17 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు దెబ్బతినడంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవతో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం 250 మీటర్ల సీసీ రోడ్డు ఏర్పాటుకు అంగీకరించింది. ఇటీవల పనులు ప్రారంభించి పూర్తి చేశారు.

ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు పరిష్కరించాలి

కొలిమిగుండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యురాలు సలోమి కోరారు. సోమవారం తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీలు పొలాలు సాగు చేసుకుంటున్నా ఆన్‌లైన్ నమోదు, పట్టాదార్ పాసుపుస్తకాలు మంజూరు కాకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ విత్తనాలు, రైతు భరోసా, బ్యాంక్ రుణాలకు నోచుకోవడం లేదని వివరించారు.

ఆసరా వారోత్సవాలు విజయవంతం చేయాలి

కొలిమిగుండ్ల: మండలంలో వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుబ్బరాజు, ఏపీఎం తిరుపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం వైకేపీ కార్యాలయంలో వీఓఏలు, సీసీలు, వైకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 3న నిర్వహించనున్న వైఎస్ఆర్ వారోత్సవాలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మునీశ్వరి పాల్గొన్నారు.

వీఆర్‌ఏ ఆత్మహత్య

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం ఆర్ లింగందిన్నె వీఆర్‌ఏ పెద్ద ఆదెప్ప(72) సోమవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ ప్రతాప్ అందించిన సమాచారం మేరకు.. ఆదెప్ప కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమార్తె ఆదెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థికి గాయాలు

డోన్ రూరల్: మండల పరిధిలోని యు.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి బాషాకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. విద్యార్థి బాషా సోమవారం డోన్ పట్టణంలో పరీక్ష రాసి తిరిగి బైక్‌పై సొంత గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో రుద్రాక్ష గుట్ట వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మోకాలి వద్ద విరగడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

రేపు వేలం పాటలు

బేతంచెర్ల: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని దినసరి, వారపు సంత, బండ్లమెట్ట, కబేళా నిర్వహణకు ఈనెల 29న వేలం పాటలు నిర్వహించనున్నట్లు కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 1965 ఏపీ మున్సిపాలిటీ చట్టం ప్రకారం నిర్వహించే వేలం పాటలో ధరవాత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

బనగానపల్లె: మండలంలోని బత్తులూరుపాడు, యనకండ్ల గ్రామాల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మంగళవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తుంచనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బత్తులూరుపాడు గ్రామంలో రూ.5 లక్షలలో నిర్మించిన మినరల్‌వాటర్ ప్లాంట్, యనకండ్ల గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.23 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన డ్రైనేజీ పనులు, బస్సు షెల్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

నేడు ఆకుమల్లలో మొబైల్ ఆధార్ కేంద్రం

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం ఆకుమల్ల గ్రామసచివాలయ పరిధిలో మంగళవారం మొబైల్ ఆధార్‌కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కొత్తగా ఆధార్ నమోదు చేసుకునే వారు, నమోదు పూర్తి అయి ఆధార్‌కార్డు పొందాలనే వారు కేంద్రంలో సంప్రదించవచ్చన్నారు. ఇంటి చిరునామా, మొబైల్ నంబర్ మార్పు చేసుకునే వారు మొబైల్ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 29న ముక్కమల్ల గ్రామ సచివాలయ పరిధిలో మొబైల్ ఆధార్‌కేంద్రం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు.

29న వాటర్ ప్లాంట్ ప్రారంభం

కొలిమిగుండ్ల: ఈనెల 29న మండల కేంద్రంలోని జమ్మలమడుగు జంక్షన్‌లో ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించనున్నట్లు పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి ట్రస్ట్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాటర్ ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.